

# రగులుకొనే రాక్షసిబొగ్గు

రామవరపు వేణుగోపాలరావు

"వరాలూ, ఇవాళ సాయంత్రం సిక్స్ డౌన్‌మీద లైనెళ్ళాలి. ఎల్లుండి సాయంత్రం మళ్ళీ వస్తాను... బహుశా ఇవాళ సాయంకాలం నే నెళ్ళేక ధర్మారావు వస్తాడు. నేనడిగినట్టు వాడినో వందరూపాయిలడుగు..." అన్నాడు అప్పుడే ఇంట్లో కాలెట్టిన సుబ్రమణ్యం

చింకి చేటముందు కూర్చొని అందులోని పిడికెడు బియ్యం నూకల్ని భూతద్దాల్లాంటి కళ్ళద్దాల్తో చూస్తూ - ఏదో ఆలోచిస్తూన్న వరాలనబడే సీతావరలక్ష్మి - అతని మాటలికి తలెత్తింది ఆ ఎత్తిన తలమీద కళ్ళలో, పెదాల్లో, అల్పంగా వుండే చెంపల్లో, కళ్ళకింద అనంతంగా పరుచుకున్న నీడల్లో ఎన్నో సందేహాలూ, ప్రశ్నలూ వున్నాయి. ఆమెని చూసిన ఒక్క లిప్తపాటు కాలంలో అవి సుబ్రమణ్యానికి కన్పించేయి. కాని ఆ ప్రశ్నల

కతను సమాధానాలు చెప్పలేదు. ఆ సందే హాలకి వ్యాఖ్యానాలు చెయ్యలేదు


సుబ్రమణ్యం మౌనంగా మూలనున్న బట్టల స్టేండ్ దగ్గరికివెళ్ళి ఓ జత బట్టల్ని చిన్న సంచీలోకుక్కి - బైటికి వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యేడు అతవింకా గుమ్మం దగ్గర వుండగానే 'ఏమండీ' అని పిల్చింది వరాలు. వెనక్కి తిరక్కుండా అక్కణ్ణించే 'ఏం' అన్నట్టు చూసేడు సుబ్రమణ్యం

"ఇవాళ మూడుసార్లు ఎవరోకాబూలీ వాడు మనింటి కొచ్చేడు. మూడునెల్ల వడ్డీ ఇవ్వాల్ట..."అని కాసేపు ఆగింది. "మళ్ళీ యిప్పుడు సాయంకాలం వొస్తానన్నాడు... వాడిని ఇలా ఇంటికి రావొద్దని చెప్పగూడదూ..." అంది దీనంగా

దొరికిపోయిన దొంగలా చకితుడయ్యేడు సుబ్రమణ్యం ఆఖరికి కాబూలీ వాడి దగ్గర డబ్బు అప్పు తీసుకునేంత ఆర్ధికపతనం తను చెందినట్టు 'వరాలికి' కూడా తెల్సిపోయిందన్నమాట! రెండు క్షణాలు ఏ మాటా అనకుండా గుమ్మం దగ్గరే నిలబడిపోయేడు తర్వాత ఏదో గొణుక్కొని- 'అలాగే' అని ముందుకి సాగిపోయేడు.


ఆ కాబూలీవా డెవరో మళ్ళీ ఇంటికి వొస్తున్నాడన్నా - పదేపదే ఇకముందు వచ్చినా వరాలుకి భయంలేదు వాడలా రావడం ఇరుగుపొరుగు చూసి నవ్వుతారనే దిగులూ లేదు... కాని- ధర్మారావు వస్తున్నాడంటేనే వరాలి శరీరం అపరిమితంగా వొణుకుతోంది. ఎవరి రాకకై తే తను భయపడ్తూందో ఆ వ్యక్తినే- భర్త అడుగుతున్నట్టు వందరూపాయిలు అప్పడగాలి 'హే భగవాన్' అనుకుంది వరాలు

నూకలున్న చేట- రెండ్రోజులుగా నిప్పుచెయ్యని పొయ్యి వున్న చోట పెట్టింది అలా నిలబడే ఎదురుగావున్న షెల్ఫు వేపు చూసింది పదికేజీల బియ్యం సునాయాసంగా పట్టే బ్రిటానియా బిస్కెట్‌డబ్బా. అయిదారు హార్లిక్స్ సీసాలు, పది పన్నెండు బోర్న్‌విటా - నెస్కేఫ్- ఓవల్టిన్ డబ్బాలు వున్నాయి. ఒకప్పుడు అవి సమృద్ధిగా బియ్యం ఉప్పు పప్పుల్తో - నూనె నెయ్యిల్తో నిండి వుండేవి ఇప్పుడవన్నీ ఖాళీ! ఏడబ్బాలోనూ 'అవి' ఒకప్పుడుండే ఛాయలు కూడా లేవు. యుద్ధం జరిగిన తర్వాత అగపడే శిథిలాలకన్నా, అన్యాయంగా వున్నాయి ఉస్సురని నిట్టూరుస్తూ గదిలోకినడిచి ట్రంకుపెట్టె తెరిచింది ...ఈ పెట్టెమాత్రం సీసాలూ డబ్బాల్లా కాకుండా అందులో ఒకప్పుడుండే వస్తువుల ఔన్నత్యాన్ని చాటుతున్నది ఎందుకంటే వాటి శిథిలాలన్నీ అందులోనే వున్నాయి... అఫ్‌కోర్స్.. వెండి బంగారం వస్తువులుతప్ప! వరాలు ఒక్కొక్క వస్తువేతీసి పరీక్షించడం ప్రారంభించింది ఆలోచనలూ బుర్రలో




జోరీగల్లా తిరగపొగేయి ... ఆ పెట్టె ఒకానొకప్పుడు రంగురంగుల వాయిల్ చీరల్ని – జార్జెట్ చీరల్ని, టెర్లిన్ చీరల్ని – జాకెట్లని – రకరకాల బ్రేసరీల్ని భద్రంగా దాచింది పెట్టె మూత తెరవగానే ఇంద్రధనుస్సే కళ్ళముందు మెదిలేది బజార్లో ఏరకంచీర ఎంత ధరైనాసరే – కొత్తగావొస్తే అదీ పెట్లో అమర్నాడే వుండితీరాలి అది ఆసాయంత్రమే వరాలి ఒంటిమీద తూగాడాలి ... మరిప్పుడా శోభయేదీ? ఆచీరల, జాకెట్ల రంగుల వయ్యారాలు ఏ చీకటిగుయ్యారాల్లో కప్పడిపోయేయి? ఆచీరల గరగరలు రెపరెపలు ఏపచ్చడి నూరుతున్న రుబ్బురోలు చప్పుళ్ళలో సమాధి చేయబడ్డాయి? వాటి వెనుక కథలు – వరాలి మనసులో సంక్షోభాలు – రెండూ ఒకటే!... కొన్ని చీరలుచిరిగి వాలికలయ్యేయి కొన్ని అలుగుడ్డలయేయి. మరికొన్ని ఉర్దాం మార్కెట్టు సెకండు హేండు బట్టలషాపులో పనిమనిషి 'లచ్చుమమ్మ' ద్వారా కాళ్ళొచ్చి వెళ్ళిపోయేయి. వున్నవి వుండగా – కాస్త ఆకారంవున్న చీర – పట్టుచీర ఒక్కటే! అది పెళ్ళినాడు అత్తవారుపెట్టిన చీర ఆ చీరకింకా కాళ్ళు రాకపోవడానికి పైది ఒక్కటే కారణంకాదు. ఆచీరతో దేవీపీఠంముందు కూర్చుని ఎన్నో పూజ ల్చేసింది వ్రతాలు ఆచరించింది నోములు నోచింది. ఆచీర కట్టుకునే భర్తతో ఓ నెలపాటు బోటుషికార్లూ – బీచ్ విహారాలూ – జూ సందర్శనాలూ చేసింది మెడలోవి మాంగల్యం, నెక్లెస్, ఉంగరాలు, వెండికంచం, పన్నీరు బుడ్డీ,

ఊదొత్తులు పెట్టుకునే చిలకలబొమ్మలు ...అన్నీ బజార్లోని బంగారం షాపులోకి తాకట్టుకీ – ఆఖరికి అమ్మకానికీ పోయినా– మిగిలిన ఖరీదైన ఒక్కవస్తువూ ఈ ఎడుపురంగు పట్టుచీరే! ఇదొక్కటే ఆమె గతజీవితపు వైభవాన్ని అద్దంపట్టి చూపిస్తుంది. అందుకే అదింకా బలవంతంగా ఆపెట్టెలో వుంచబడింది ... ఆపట్టుచీరనీ – పట్టుజాకెట్టునీ వరాలు బైటకితీసింది. తీస్తోంటే ఏవో డబ్బులు పడ్డ చప్పుడైంది. అది డబ్బుల చప్పుళ్ళుగా కాకుండా శ్రీదేవి కాలిఅందెల ఘలుఘల్లులా వినిపించింది వరాలికి. ఆత్రంగా అటు చూసింది. అయిదు మూడు పైసాల నాణేలూ, మూడు రెండు పైసాలనాణేలూ – నాలుగు పైసాలూ... మొత్తం ఇరవై అయిదు పైసాలు ... పావలా! వరాలు వాటన్నిట్నీ గుప్పెట్లోకి తీసుకుని పెన్నిధిలా చూసింది. కళ్ళు చెమర్చేయి. పట్టుచీరనీ జాకెట్టునీ దండేనికి తగిలించి పక్కింటివారి కుర్రాడిని పిల్చింది... వాడి చేతిలో పావలాపెట్టి – 'చూడు నానీ, అణా టీ గుండ పేకెట్టూ, బేడ పంచదార తీసుకురావూ? నీకోపైసా యిస్తాన్లే!' అంది. ఆకుర్రాడు ముఖం వేలేసి 'అణాకీ కానీకీ కొట్టువాడు సామాన్లివ్వడండీ' అని సునిసేడు ... 'బాబ్బాబు. వెళ్ళు నానీ – యిస్తాళ్ళే!' అంది వరాలు, 'అలాగే' అంటూ నానీ అయిష్టంగానే వెళ్ళిపోయేడు. నానీ అటు వెళ్ళగానే నీళ్ళకుండీదగ్గర స్నానంచేద్దామని కూర్చుంది వరాలు. గబగబా నాలుగుచెంబులు ఒంటిమీద దిమ్మరించుకుని నాగులు గావంచాతో ఒళ్ళు తుడుచుకుంది. తుడుచుకుంటూ తుడుచుకుంటూ అప్రయత్నంగా పొట్టవేపు చూసుకుంది. తనకి ఒంట్లో నిస్త్రాణగా – తలకి నొప్పిగా వుండడానికీ – ఆపొట్ట రెండ్రోజులుగా (అద్దెకి ఎవరూ దిగని దెయ్యాలకొంపలాగా) ఖాళీగా వుండడానికీ గల అవినాభావసంబంధం వరాలికి మరోసారి తెలిసొచ్చింది. తెలిసేక ముఖంమీద నీరసంగా కాంతిలేని చిరునవ్వొకటి కదిలింది. ఉస్సురుమని నిట్టూర్చింది. నిట్టూర్చేక – గదిలోకి వెళ్ళి అయిదేళ్ళపాతబడ్డ పట్టుచీర ఒంటికి చుట్టబెట్టుకుంది..అంతలో నానీవచ్చేడు. రెండు పొట్లాలూ వరాలిచేతిలో పెట్టేడు. తనో పైస తీసుకుని మిగిలిన అయిదు పైసాలూ ఆమెచేతిలో పెట్టేడు... 'థేంక్ యూ నానీ!' అంది వరాలు. 'నో మెన్షన్ సార్' అన్నాడు నాని. వరాలు నానీని దగ్గరగా తీసుకుని నుదుటిమీద అల్లిబిల్లిగా పడివున్న వెంట్రుకల్ని సవరించింది. 'సార్ కాదు, మేడమ్!' అంది. 'సారీ నో మెన్షన్ మేడమ్!' – అంటూ బైటకి తుర్రుమన్నాడు నానీ ..తలుపు గడియవేసి – పగిలిన నిలువుటద్దం ముందు నిలబడింది వరాలు. అద్దంలోని తన ప్రతిబింబాన్ని చూస్తూ పట్టుజాకెట్టు తొడు




తున్నంది. గుండీలు పెట్టుకోబోయి ఆగింది... 'ఆయిదేళ్ళకే నేను లావెక్కేనా లేక బాడీలేకుండా జాకెట్టు వేసుకున్నందుకు ఇలావుందా?' అనుకుంటూ రొమ్ముల వేపూ - మాసినా రంగుమాయని జాకెట్టువేపూ చూసింది... ఎందుకో మనస్ఫూర్తిగా నవ్వుకుంది. మళ్ళీ పెట్టె దగ్గరికి వెళ్ళి కెలికింది. పది పన్నెండు బ్రేసరీలు - చేతికుట్టు బాడీలూ అందులో పసిరిక పాముల్లా పడుండేవి ఒకప్పుడు ఇప్పుడొక్కటీలేదు... నిస్పృహగా అద్దం ముందుకి వచ్చింది. అతికష్టంమీద మీదగుండీ రెండోగుండీ ప్రెస్ చేసింది. మూడో ప్రెస్‌బటన్ నొక్కుదామంటే జాకెట్టు చివర్లు సమ్మె చేసేయి. అంతలో 'ధర్మారావు వొస్తాడని' సుబ్రమణ్యం చెప్పిన సంగతి ఆమెబుర్రలో మెదిలింది. ఆతలపు రాగానే ఒళ్ళు ఝల్లుమంది. ఆందోళనగా ఒక్కసారి వూపిరి తీసుకునే సరికి - జాకెట్టుబటన్స్ పట్ పట్ మంటూ విడిపోయేయి...

ధర్మారావు వస్తాడు... 'ఆశను' లేనప్పుడు తను ఒంటరిగా వున్నప్పుడు ధర్మారావు వస్తాడు... ఈ నిజం ఆమె గుండెల్లో గునపంలా దిగుతోంది. అతని ఆకలిచూపులు... తనకి పెళ్ళి కాక ముందు అతను ప్రేమలేఖలు రాసిన వైనం... వరాలు మస్తిష్కనిలయంలో దెబ్బతిన్న తాచుపాముల్లా దిగులుగా జొరబడుతున్నాయి. పెళ్ళికాక ముందూ, అయిన తర్వాతా, ఆ తర్వాతా కూడా ఆ ఆకలిచూపులు ఏమీమారలేద

ఆ కళ్ళల్లో తనమీది ఆకలే కాదు; దెబ్బ తిన్న అహం - ఎన్నటికేనా తలొంచుకున్నది జయిస్తానన్న పట్టుదలావున్నాయి. అందుకే వరాలి భయం!

ధర్మారావు ఇప్పుడొస్తాడు ... తన పట్టుచీరా వాలకంచూసి తనకి రెస్పాన్స్ ఇస్తున్నా ననుకుంటాడేవో!...'అవును తప్పకుండా అలాగే అనుకుంటాడు!' అన్నట్టుచూసింది అద్దంలోని ప్రతిబింబం. అట్లా అనుకుంటే తనని తప్పక జయిస్తాడు ధర్మారావు. 'అతను లైనుమీద టాటా వెళ్ళేడు. అతని పేకాటా - తాగుడూ - దారిద్ర్యమూ ధర్మారావుకి తెలుసు రెండురోజులుగా కటిక పస్తులుండి ధర్మారావు ధర్మానికేమేవిద్దరం పడివున్నామన్న సంగతీ అతనికితెలుసు. ఈ పరిస్థితుల్లో అతను వొస్తున్నాడు. అతన్ని అప్పడగమని నా భర్త నన్ను నియోగించేడు. ఈ బలహీనతలు ఆసరాగా అతను నా ఒంటిమీద చెయ్యివేస్తే - నన్ను పాడుచేస్తే నా గతేం కాను? భగవంతుడా, నేనేం చెయ్యను?!' అనుకుంది వరాలు మనస్సులో కాసేపలా ఆలోచించు గూట్లోవున్న పెన్సిలూ నాలుగు కాగితాలూ తీసుకుని ముందేసుకుంది. మరి కాసేపు దీర్ఘంగా ఆలోచించి కాగితాలమీద రాయడం ప్రారంభించింది.

'డియర్ ధర్మారావ్,

నేనిలా నీకు ఉత్తరం రాయడం, అది చదవమని నీకే నేనివ్వడంచూసి నువ్వు ఆశ్చర్యపోతావు. కాని నాకు తప్పటంలేదు. ఇలా నీకు ఉత్తరం రాయడం నాకేకోశానా ఇష్టంలేదు. కాని మరోగత్యంతరంలేక రాస్తున్నాను. నేను కొన్ని విషయాలు ... అందులో చాలా మట్టుకి నీకుతెల్సినవే రాస్తున్నాను. ఇది చదివేక నువ్వో నిర్ణయానికి రా. నువ్వేం చేసినా సహిస్తాను.

నేను ఎక్కడ పుట్టిందీ, ఎక్కడ పెరిగిందీ, ఎలాంటి సంపన్నుల యింట భోగభాగ్యాలు అనుభవించిందీ నీకు తెలుసు. కారణం మీరప్పుడు మా పక్కింట్లో వుండేవారు మనందరం క్లాస్‌మేట్సుంగూడా. నువ్వూ నేనూ సత్యం మా చెల్లీ కోతికొమ్మచ్చులు ఆడుకున్నాం. అది నాకింకా గుర్తే! నాకు పదమూడు... పద్నాలుగేళ్ళు వొచ్చేయి. రోజు రోజుకీ వంపులు తిరుగుతోన్న నా శరీరం నాకే వింతగా వుండేది... అప్పట్లోనే నీకోనూ మార్పు వచ్చింది. నీ కళ్ళు చిలిపిగా ఎప్పుడూ నా ఒంటి మీదే తారట్లాడేవి. నా పక్కని కూర్చోగానికి నువ్వూ సత్యమూ పోట్లాడుకునేవారు. నేను మిమ్మల్ని సమాధానపర్చి ఇటొకర్నీ అటొకర్నీ కూర్చోబెట్టుకునేదాన్ని. సుని ఆటల్లో పాటల్లో ఆ మూరుమూల ఈ గ్రామంలోని మునసబుగారి మామిడితోట హోరుమని పోవడం నేనిప్పటికీ మర్చిపోలేను. అప్పట్లో - నీ

సాన్నిహిత్యం, నాచెంపలమీద వెంపర లాడే నీ ఉచ్ఛ్వాసనిశ్వాసాలవేడి,వంపులు తిరుగుతూ ఇంకా రూపందాల్చని నా ఛాతీమీద నీ చూపులముళ్ళూ – నా కింకా జ్ఞాపకమే! అప్పుడే – బేబీ సీతామహాలక్ష్మి నైన నేను మిస్ సీతామహాలక్ష్మి నై పోయేను. మా నాన్న నా చదువు మాన్పించేసేరు. అప్పట్లోనే నువ్వు నాకు ఉత్తరాలు రాసేవాడివి మునసబుగారి మామిడితోటలో ఎన్ని రాత్రుళ్లు నువ్వు నాకోసం పడిగాపులు కాచేవో నే నూహించగల్ను. నా ఖర్మకాలి నువ్వు రాసిన ఓ ఉత్తరం మావాళ్ళకంటపడింది. రక్తం వచ్చేలా మా అమ్మ నన్ను చీపుర్తో బాదింది. మా నాయనమ్మ నా దవడలు సాగదీసింది 'మన జాతా మన నీతా – వాడికీ నీకూ మధ్య ఉత్తరాలేమిటే?' అని సమయం వొచ్చినపుడల్లా మా అమ్మ నన్ను సాధించేది. మా నాన్నగారుమాత్రం నన్నేమీ అన్లేదు. ఆయన చేసిందల్లా – సంవత్సరం తిరక్కుండా నాపెళ్ళి చేసెయ్యడమే! మా మామగారు రెయిల్వేలో ఏదో ఇంజనీరు. వెయ్యిరూపాయిలకి పైగా సంపాదన. అదినాకి స్వతహాగా సంపన్నులు...

మా ఆయనా బాగానే వుంటారు. ఆయనకీ రెయిల్వేలోనే పని పెళ్ళయి నాక ఇద్దరం మొన్నోవూళ్ళు తిరిగేం ఎన్నో స్థలాలు చూసేం... నా దుర దృష్టం మండి – నెలరోజులేనా పూర్తి కాకముందే వాతంకమ్మి ఆయన చని పోయేరు... నా కాళ్ళ పెళ్ళిపారాణి ఇంకా ఆరనేలేదు. పసుపుబట్టల మర కలు మాయలేదు. మాంగల్యం రంగు ఒంటి చెమటతో నెలరోజులన్నా సరిగ్గా సావాసం చెయ్యలేదు. అంతలోనే ఈ విధి వైపరీత్యం! ఆకాశం బద్దలయ్యేలా భోరుమని ఏడ్చేను. గుండె చెక్కల యేలా రోదించేను. పదిహేడేళ్ళు సరిగా నిండని నాకు పెళ్ళి – వైధవ్యం నెల రోజుల తేడాలో ప్రాప్తించేయి. నెల్లాళ్ళకలా పుట్టింటికొచ్చి పడ్డాను. నేను కాలు పెట్టిన వేళావిశేషం ఎల్లాంటిదో – మా యింట్లోని 'ఆపరలక్ష్మి' అంతరించ సాగింది నా మీది బెంగతో మా నాన్నారు చచ్చిపోయేరు. అమ్మా – నేనూ – నలుగురుతమ్ముళ్ళూ మిగిలేం. ఒక్కొక్క ఎకరం అమ్ముడుపో సాగింది .. అదే సమయంలో మా మామగారు మావూ రొచ్చేరు. ఇలాజరిగినందుకు తను చాలా విచారిస్తున్నాను – అన్నారు. నన్నుబాగా చదివించి నేను నా కాళ్ళమీద నిలబడ గలిగేవరకూ నన్ను పోషిస్తామన్నారు. మా అమ్మ ఒప్పుకోలేదు కాని మా మామగారి బలవంతంమీద ఒప్పుకోక తప్ప లేదు. మా మామగారు నన్ను విశాఖ పట్నంలో చదువుకి పెట్టేరు నాతోబాటే నా ఆడపడుచులూ మరుదులూ చదువు కుంటూ వుండేవారు. మా మామగారి విధ వాడపడుచు మా పెట్టుపోతలు

చూస్తుండేది.... అలా ఏళ్ళు గడిచేయి... నాలోని పరిపూర్ణ వ్యక్తి కదులాడ్డం మొదలైంది. నా గురించి నేను ఆలో చించసాగేను... ఇంకొన్నాళ్ళు పోతే బియ్యే డిగ్రీ వస్తుంది. టైప్‌రైటింగూ షార్ట్‌హేండూ నేర్చుకోవడంకూడా అయిపోతుంది. ఎక్కడో ఓచోట ఉద్యోగం దొరుకుతుంది. నాలుగురాళ్లు సంపాదించుకుని తింటూ వుంటాను. అంతేనా ?_ అదేనా నా ధ్యేయం ? చేతికి గాజులు లేకండా, నుదుటని తిలకం లేకుండా తెల్లచీరలు కట్టుకుంటూ జీవి తాంతం నే నిలా గొడ్డుబతుకు బతకా ల్సిందేనా...? అని తలుచుకుంటూ నిరం తరం వ్యథతో కుమిలిపోయేదాన్ని. ఈ ఆలోచనల్లోనే సతమతమౌతూ రెండు సార్లు మెట్రిక్ పరీక్ష ఫెయిలయ్యేను...

ఓరోజు సుబ్రమణ్యాన్నీ, నన్నూ యింట్లో వుంచి మామ్మగారితో సహా అందరూ సినిమాకి వెళ్ళేరు. సుబ్ర మణ్యం ముందరగదిలో చదువుకుంటు న్నాడు...నాలో అజ్ఞాతంగా వున్న బాల్య చాపల్యాలు తలెత్తేయి. నా పెట్లోంచి పాలపిట్టరంగు టెర్లిన్ చీరా, జాకెట్టూ తీసి తొడుక్కున్నాను. అయిదేళ్లగా కాటు కెరగని కళ్ళకి కాటుక రాసుకు న్నాను. దోసగింజంత తిలకం పెట్టుకు న్నాను. ముడి విప్పి రెండుజడలు వేసు కున్నాను. స్నో, పౌడర్లు రాసుకుని అద్దంముందు నిలబడ్డాను. నా ప్రతి బింబాన్ని చూసి నేనేనా అనుకున్నాను. ఆశ్చర్యపోయేను. సంబరపడ్డాను. ఈ అదృష్టం నాకు బతికినన్నాళ్ళూ మరి లేదన్న నగ్నసత్యం ఒక్కసారి స్ఫురించగానే ఒళ్ళంతా ఝల్లుమంది. నెలరోజులు మాత్రం అనుభవించిన 'పురుష స్పర్శ' మరి నాకు లేనేలేదు. పెద్దల్ని ఎదిరించి ఒకవేళ మరో పెళ్ళి చేసుకున్నా, అది లోకం హర్షిస్తుందా ? అయినా నన్ను మళ్ళీ ఎవడు పెళ్ళా డ్తాడు ?...విచారంతో క్రుంగిపోయేను.

'వదినా' అంటూ తడబడ్తూ విన వచ్చిన దిక్కుని చూసేను. సుబ్రమణ్యం వున్నాడక్కడ !

'ఎంత బావున్నావ్ వదినా ! ?' అన్నాడు.

శిలాప్రతిమలా అతన్నే చూస్తూండి పోయేను. సుబ్రమణ్యం 'అతని'కన్నా ఒక్క ఏడాదిమాత్రం చిన్నవాడు ఇద్దరి పోలికలూ ఎంతో దగ్గరగా వుంటాయి అతన్ని చూస్తోంటే 'మా వారే' నాకు గుర్తుకొస్తారు నా పెళ్ళికి సుబ్రమణ్యం చిన్నవాడు నూనూగు మీసాలకుర్రాడు.ఇరవై నాలుగు వసంతాలు నడిచిపోయిన చిహ్నాలు అతని బుగ్గల్లో, పెదాలమీద, కండల్లో, చూపుల్లో కన్పిస్తాయి. బిత్తరపోతూ అలాగే నించున్నాను. సుబ్రమణ్యం ఒకో అడుగు ముందుకి వేస్తూ నాకు దగ్గరగా వచ్చేశాడు. 'సుబ్రమణ్యం




నా మరది. నేను విధవని. మరది కుమారుడితో సమానం' అన్న నిజాల్ని నేను మర్చిపోయేనేమో... నా కళ్ళముందు – ఐదేళ్ళక్రింద చనిపోయిన 'మా ఆయనే' కన్పిస్తున్నాడు. ఆయనే మళ్ళీ బతికి వచ్చేరా అన్న భ్రమ...నన్ను పట్టిన ఆ చేతుల్ని కాదనలేదు. నా ముఖంమీద ముఖం ఆన్చి దేనికోసమో వెతుకులాడుతున్న అతని పెదాల్ని వద్దనలేదు. గుండెలమీది ఎత్తుపల్లాల్ని పరామర్శిస్తోన్న అతని వేళ్ళని అటంకపర్చలేదు. ఆ అయోమయస్థితిలో రాయిలా నిల్చుండిపోయేను. గుండెల్లో పెనుతుఫాను మస్తిష్కంలో రాళ్ళవర్షం. శరీరంలో నరాల్నింటా రగులుకొన్న రాక్షసిదోగ్గు సెగలు. నా వైధవ్యం నన్ను అలంకా

రాళ్ళనుంచీ, బొట్టుకాటుకలనుంచీ, రంగు రంగుల చీరల్నుంచీ దూరం చేయగలదే తప్ప – నా ఉద్రేకాలనీ, కోరికలనీ చంప లేదని మొట్టమొదటిసారిగా అప్పుడే గ్రహించేను అన్యుడితో నా కోరిక తీర్చుకోవడం పాపమా ?– అని ప్రశ్నించు కున్నాను నన్ను చుట్టుకునిపోయివున్న సుబ్రమణ్యాన్ని ఒక్కసారి విడిలించేను గజందూరంలో నిలబడి తప్పుచేసిన వాడిలా సిగ్గు పడ్తూ నన్ను చూసేడు... మరికొన్ని రోజులకే – నేనూ, సుబ్ర మణ్యం 'లోకం దృష్టిలో' లేచిపోయేం।

'నువ్వు మా అన్నభార్యవే కావచ్చు ఏమేనా కావచ్చు. ఆ మతాల ఘోషా, సంఘం గోలా నేను వినను. నేను హిందువునీ, క్రైస్తవుడినీ, ముస్లిమ్‌నీ .. ఎవర్నీ కాను। నేను కేవలం ఒక మని షిని మానవత్వం వున్నవాణ్ణి విధవా వివాహాలు చట్టబద్ధమైనా నిన్నెవడూ ఈ రోజుల్లో పెళ్ళిచేసుకోడు భర్త పోయిన స్త్రీ – తుక్కు ముట్టుకున్న అన్నం రెండూ ఒకటే – అంటారు వాళ్ళు పెళ్ళిమాత్రం చేసుకుంటారా ? నువ్వు అందకత్తెవు కాబట్టి నిన్నారా ధించే ఉమ్మేదలకి మాత్రం కొదవ వుండదు వాళ్ళవల్ల నీకు అధఃపతనమే తప్ప ఒరిగేదేమీ వుండదు అంచేతే నిన్నిలా తీసుకొచ్చేను నీ కళ్ళకి కాటుక వుండాలి నీ నుదుటిని కుంకుమరంగులు శోభిల్లాలి నీ చేతులగాజులు గలగం లాడాలి రంగుల చీరల్లో నువ్వో హరి విల్లులా దర్శనమివ్వాలి. నీ బతుకు నందనవనం అవ్వాలి. అందుకే నిన్నిలా తీసుకొచ్చేను పెద్దల్ని ఎదిరించి–సం ఘాన్ని ఎదిరించి–మీదుమిక్కిలి నా భవి ష్యత్తునికూడా పణంగాపెట్టి. నిన్ను నా సహచరిగా చేసుకుంటున్నాను...మనకి మైనారిటీ తీరినా–మన పెళ్ళికి 'లా' ఒప్పు కోదు మామూలే 'లా' ఈనాడూ ఆనాడూకూడా స్వార్థపరుల స్వప్రయోజ నాలకే వుపయోగపడ్తూ వస్తోంది నాతో కలిసి జీవించడం – నాతో కాపురం చెయ్యడం నీ కిష్టమేనా ?' అన్నాడు సుబ్రమణ్యం

నేను నివ్వెరపోయేను ఎంతగా ఎదిగిపోయేడు సుబ్రమణ్యం। నా భవిష్యత్తుమీద అతనికి ఎందుకింత ఆసక్తి। నాలో యేం చూసి – ఆతనింత త్యాగం చేస్తున్నాడు ? ఈ ప్రశ్నలకి సమాధానాలు నాకిప్పటికీ దొరకలేదు .. ఉద్యోగంకోసం సుబ్రమణ్యం కాళ్ళరిగేలా తిరిగేడు. అలా ఆరునెలలు తిరిగేకకానీ ఉద్యోగం దొరకలేదు ఆ దొరికిన వుద్యోగం కూడా లోకోషెడ్లో ఇంజన్లు తుడిచేపని ఈలోగా మా అత్తవారింటి కబుర్లు ఒకొక్కటే వచ్చేయి వాళ్ళమమ్మల్ని ఎన్ని రకాలుగా అసహ్యించుకోవాలో అన్ని రకాలుగానూ అసహ్యించుకున్నారు అన్నింటికీ సుబ్రమణ్యం సహించేడు




మా ఆడపడుచులకి పెళ్ళిసంబంధాలు రావడం లేదట... ఓ ఆడపడుచు ఎవర్తోనో లేచిపోయిందట...ఇది జరిగిన కొన్నాళ్ళకి మా అత్తగారు నూతిలో పడిపోయేరట ఇన్ని విన్నా సుబ్రమణ్యం చలించలేదు అయితే – సుకుమారంగా వుండే అతని మనఃప్రవృత్తి శిలకన్నా కఠినంగా మారిందని మాత్రం చెప్పగలను.

అప్పుడే ప్రారంభించేడు పేకాటా – తాగుడూ! వచ్చే జీతంచాలక అప్పులు. అందునా కాబూలీ అప్పులు. వడ్డీలకే సరిపోయేది అతని జీతం ఇదంతా చూస్తూ ఎంతో బాధపడేదాన్ని. అతన్ని పాడుపన్లు మానమని చెప్పడానిక్కూడా జంకేదాన్ని అతనిలా పతనం అవడానికి – అందరికీ దూరం అవడానికి నేనేగా కారణం! అతన్నెలా బాగు చేసుకోగలన్ను..? – మళ్ళీ నా విధి వక్రించింది ఎన్నోఏళ్ళుగా కనబడని నువ్వు కన్పించేవు నువ్వూ. సుబ్రమణ్యం పేకాటఫ్రెండ్స్ అనికూడా తెల్సింది పేకాటలో తరచూ సుబ్రమణ్యం ఓడేవాడనీ – నువ్వే డబ్బంతా గెలుచుకునేవాడివనీ తెల్సింది. ఆబాపతు డబ్బూ – అడపా దడపా తీసుకొన్న డబ్బూ మొత్తం ఓ వెయ్యిరూపాయల దాకా సుబ్రమణ్యం నీకు ఋణపడి వున్నాడనికూడా తెల్సుకున్నాను ధర్మరాజు ద్రౌపదిని ఒడ్డినట్టు నన్ను కూడా ఓనాడు పణంగాపెట్టి ఓడిపోతాడేమోనన్న అనుమానంకూడా నన్నీమధ్య పట్టుకుంది. ఆ అనుమానానిక్కారణం నువ్వే! నువ్వే!! తరచు మాయింటికి నువ్వు రావడాలూ, నీకళ్ళల్లో నామీది కాంక్ష – నేనిట్టే గుర్తుపట్టేయగలను ఆనాడు నిన్ను నిర్లక్ష్యంచేసిన నేరానికి

నువ్వు విధించేశిక్ష ఏ రూపంలో వుంటుందో గూడా నాకు తెలుసు. అందుకే ఈ ఆవేదన. ఈ లేఖా అందుకే!

పతితలైన ఆడవాళ్ళ కథలెన్నో చదివేను. అందులో చాలామందిలాగా నేను ధర్మాలూ శాస్త్రాలు చదువుకోలేదు. నాకు ఏది ధర్మమో, ఏది న్యాయమో అంతగా తెలీదు. నే చేసిందల్లా నా మరిదితో కలిసి జీవించడమే! – అదే నా తప్పు. అలాంటి పరిస్థితులు ఏర్పరచిన సంఘటనల్ని నీకుముందే చెప్పేను. భర్త చనిపోయిన తర్వాత – అతని సోదరుణ్ణి అనధికారరీత్యా పెళ్ళాడిన నన్ను నువ్వేమన్నా అను. పడ్తాను. కాని మా దారిద్ర్యం సాకుగా తీసుకుని – నీ డబ్బుని ఎరగా పెట్టి–సుబ్రమణ్యంలేని ఈ సమయంలో – నన్నింకోలా నీమనసులో నిలుపుకోకు

నీలో నేను దేవుడిని చూసుకున్నాను– ఓనాడు! ఆపదల్లో ఆదుకునేవాడు దేవుడే ఐతే అది నువ్వే. చేతులు జోడించి నిన్నో వరం అడుగుతున్నాను. అనుగ్రహించు. ఇద్దరన్నదమ్ముల శరీర స్పర్శతో నా శరీరం మలినమైందని నువ్వు భావించవచ్చు కాని నా శీలం పవిత్రమైందనే నా నమ్మకం. నా నమ్మకాన్ని వమ్ముచేయకు. నా మానం భంగం చేయకు. నా దీక్షని రక్షించు. అంతే–!'

—అంతవరకూ రాసిన ఉత్తరాన్ని మరొకసారి చదివి చూసుకుంది వరలక్ష్మి. అంతలో తలుపు చప్పుడైంది. సంభ్రమంగా ఉత్తరం మడిచి తలుపు తీసింది. గుమ్మంలో కాబూలీవాలా! ఇంతింత మీసాలూ, జేవురించిన ముఖం, తలపాగా, షరాయీ... వరాలికి యమధర్మరాజులా కన్పించేడు 'షర్మాజీ హై?' అన్నాడు వాడు. 'లేరు' అంటూ తలెత్తి చూసింది వరాలు. తననుకున్నట్టే వాడి చూపులు తన గుండెలమీద కదులుతున్నాయి. అలాగే కన్నార్పకుండా చూస్తున్నాడు. గుమ్మందాటి మీదమీదకి వస్తున్నాడు. తలుపువేసి అడ్డంగా నిలబడ్డాడు.

'అస్‌లూ లేదు. వడ్డీలేదూ. బాకీ ఆరూ వందల్ అయిందీ. పైసా ఎప్‌డూ ఇస్తార్?' అన్నాడు మళ్ళీ. వరాలు మౌనంగా తలొంచుకుంది. 'భగవాన్, ఏమిటీ చిత్రవధ? ఎంతసేపీ హింస!'– అనుకుంది.

'బాత్ కరో!'

వరాలు తుళ్ళిపడింది. ఎంతపొగరు గట్టిగా సమాధానం చెప్దామని తలెత్తింది

'బోలో' అన్నాడు, ఈసారినవ్వుతూ.

వరాలు శరీరం వెగటుతో ఒక్కసారి జలదరించింది. దిక్కు తోచలేదు. కళ్ళ ముందు దట్టంగా చీకటి తెరలు నిలిచినట్టయింది.

అంతలో బయట ధర్మారావు గొంతుక 'సుబ్రమణ్యం' అంటూ!

పఠాన్ గిరుక్కున వెనక్కి తిరిగి బాణంలా గుమ్మందాటి వెళ్ళిపోయేడు

వెళ్ళిపోతున్న వరాన్ని చూస్తూ గుమ్మంలో అడుగెట్టేడు ధర్మారావు పులినోరు తప్పించుకుని సింహం గుహలో అడుగెట్టిన మేకలావుంది వరలక్ష్మి స్థితి.

'కూర్చో' అంది వరాలు తడబడ్తోన్న గొంతుతో ఆ తడబాటు వెనుక కంఠపు రుద్ధతని కప్పే వ్యర్థ ప్రయత్నం ధర్మారావుకి రేఖామాత్రంగా గోచరించింది.

"సుబ్రమణ్యం లేడా ?" అన్నాడు.

"లేరు లైనుమీదికి వెళ్ళేరు "

"ఎక్కడికి ?"

"టాటా"

"..మంచినీళ్ళు కావాలి !"

అంతవరకూ తల కిందికి దించుకునే మాట్లాడిన వరాలు తలెత్తింది ధర్మారావుని చూసింది... అతని కళ్ళవెనక కదులాడే భావాలు చదవబోయింది...

"ధర్మారావ్, నువ్ నన్ను ప్రేమిస్తున్నావా?"

"—ఒకప్పుడు ప్రేమించేను..."

"ఇప్పుడు ?"

"లేదు !"

"ఏంవింటిలేదు ?'

"ఏమీలేదు"

"అంటే ?—"

"........."

"పోనీ నామీద కోపంవుందా ?"

"వుంది నామనస్సునిండా అదే వుంది. నాశరీరంనిండా అదే వుంది. ప్రేమతో నిన్నోనాడు జయిద్దామనుకున్నాను. జయించలేకపోయేను ఇప్పుడు నీ దారిద్ర్యాన్ని — నీ మగాడి అసహాయతనీ బలహీనతనీ ఆధారంగా చేసుకొని నిన్ను డబ్బుతో జయించే ప్రయత్నం చేస్తున్నాను..."

"ఇంతకీ గెలుపు నీదే అనుకుంటున్నావా ?"

"అవును "

"ఎలా ?"

"సుబ్రమణ్యం వూళ్ళోలేడు నువ్వు పేద్ద పతివ్రతవికావు. మీ యిద్దరికీ డబ్బు అవసరాలున్నాయి నిన్ను బలవంతంగానైనా ఈరాత్రి జయిస్తాను అదీ వీలుకాకపోతే నీ శవాన్నయినా —"

"ధర్మారావ్ !" అంటూ పిచ్చిగా అరిచింది వరాలు.

"అవును అంతే !" అంటూ తలుపు గడియపెట్టేడు దగ్గరగావచ్చి కళ్ళల్లోకి చూస్తూ 'దాహంగావుంది' అన్నాడు.

"తెస్తా" అంటూ ఓగ్లాసుతో మంచి నీళ్ళుతెచ్చి అతనికిచ్చింది అతను తాగేక గ్లాసుని అందుకుంది. గ్లాసు నేలమీదపెట్టి టేబిలుమీద వుత్తరం చేతిలోకి తీసుకుంది...అప్పటికే మంచం మీద కూర్చుని — ఆకలికళ్ళతో తనని తీక్ష్ణంగా చూస్తోన్న ధర్మారావుని గమనించింది అతనికి దగ్గరగా వెళ్ళింది అతనిచేతులు పరాలినడుం చుట్టేయి రొమ్ములమీద అతనితల.

"ధర్మారావ్"

"వూఁ..."

"ఈ వుత్తరం ముందుచదువు!"

"తర్వాత –"

"కాదు, యిప్పుడే!!"

"సముఖంలో ప్రేమలేఖా?" అంటూ నవ్వుతూ అందుకున్నాడు వుత్తరాన్ని.

ముఖం ఓపక్కకి తిప్పుకొని పక్కనేవున్న కుర్చీలో కూర్చొంది వరాలు అన్నిటికీ సిద్ధమైన బలి పశువులా! ముఖంలో ఏభావమూలేదు. కళ్ళలో కాంతిలేదు శరీరంలో చలనం లేదు

క్షణాలు గడుస్తున్నాయి వరాలు గుండెలో బండరాళ్లు దొర్లిపడుతున్నాయి ఉత్తరం చదువుతోన్న ధర్మారావు భ్రుకుటి ముడిపడుతోంది

ధర్మారావు లేచి నిలబడ్డాడు. చదివిన ఉత్తరాన్ని ముక్క ముక్కలుగా చింపి వాటిని మంచంపక్కని పోసేడు ఏ భావమూ వ్యక్తంచేయని చూపుల్తో ఆమెని స్పర్శించేడు ... మౌనం ... గదిలో ఇద్దరిమధ్యా స్మశాన నిశ్శబ్దం...

"ఒక్క ప్రశ్నకి సమధానం చెప్పు వర్లక్ష్మీ.. "

ఏంటన్నట్టు తలెత్తింది వరాలు.

"నీ పెళ్ళికాక ముందు–ఆనాడే నాతో ఎందుకు లేచి రాలేకపోయేవు? వరాలూ నన్ను ప్రేమించేవు.. నా సాహచర్యం నీకు ఇష్టమే . అయినా ఎందు కలా చేసేవు కావు ... ఎందుకు ...? ఎందుకు???"

వరలక్ష్మి నేత్రాల కింద పరుచుకుని వున్న నీలిమలో – పెదాలమీద వెలిగిన శుష్కహాసం–రెండునీడల్ని పేర్చింది. బుగ్గలమీది చిక్కని కండరాలు విషాదంగా సంకోచించేయి.

"చెప్పమన్నావా, ధర్మారావ్! చెప్తాను అయితే దానికి ముందు నువ్వో ప్రశ్నకిసమాధానం చెప్పు...ఓబ్రాహ్మణ స్త్రీ అన్యకులం పురుషుడిని పెళ్ళాడ్డం తప్పా?–భర్త చనిపోయేక అతని అన్నదమ్ముడిని భర్తగా స్వీకరించడం తప్పా?–ఇందులో ఏది పెద్ద తప్పు!?"

ధర్మారావు మాటాడలేదు. జేబులోంచి పర్స్ తీసి రెండువందల రూపాయిల నోట్లు బైటికి లాగేడు అవి వరలక్ష్మి చేతిలో పెట్టేడు 'ఇవి నేనిచ్చేనన్చెప్పి సుబ్రహ్మణ్యం కియ్యి' అని చరచరా బయటికి నడిచేడు.

అతను వెళ్ళిన దిక్కే నిర్నిమేష అయి చూస్తూండిపోయింది వరలక్ష్మి మనస్సులో జోహారు లర్పించింది... గబగబ వంటింట్లోకి నడిచింది రాక్షసి బొగ్గు పొయ్యిలోవేసి విప్పంటించింది మరో పది నిమషాలకి కావి బొగ్గు అంటుకోదు...పొయ్యిలోంచి లేస్తోన్న పొగని చూస్తూ గుమ్మంలో కూర్చొంది ఈ పాటికి సుబ్రమణ్యం రాయగడాదాటి వుంటాడు...రాక్షసినోరులాంటి ఇంజన్



లోకి బొగ్గుకొడ్తూ – వుండివుంటాడు... రెండ్రోజుల్నించీ సరైన తిండీ తిప్పల్లేవు ... ఆ పారని ఎలా ఎత్తుతున్నాడో...!

"సుబ్రమణ్యం!"

త్రుళ్ళిపడింది వరాలు.

గుమ్మంలో మామగారు!

సుబ్రమణ్యం తండ్రి!

చనిపోయిన భర్త తండ్రి!!

"సుబ్రమణ్యం లేడా?" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

"లేరు. టాటాబండిమీద వెళ్ళేరు"

"ఎప్పుడొస్తాడు?"

"ఎల్లుండొస్తారు."

"నీ దయవల్ల మే మందరం ఎలా మట్టి కొట్టుకుపోయేమో తెలుసా? నీ ఆడుపడుచు ఒకర్తి ఎవడ్తోనో లేచిపోయింది. రెండోది ఎవడిమాయలోనోపడి ఎబార్షన్‌దాకా వెళ్ళి – చచ్చిపోయింది నువ్వూ వాడూ చేసిన అపభ్రంశం పనికి ఇందరు నాశనం అయ్యేరు. మా ఆడది – అదే – మీ అత్తగారుకూడా ఈ మధ్యే

నూతిలోపడి చావు వెదుక్కుంది నాకు మాత్రం యింకా చావు రాలేదు..."

అతని కంఠంలో కర్కశత్వం లేదు అలాగని మృదుత్వమూ లేదు నిర్వికారంగా వుంది

"సుబ్రమణ్యం స్వతహాగా ఎంతో బుద్ధిమంతుడు. తెలివైనవాడు. వాడికేం మందుపెట్టేవు? వాణ్ణెందుకిలా నాశనం చేసేవు? తన భవిష్యత్తునీ - బంధువుల్నీ కూడా వాడు ఖాతరు చెయ్యలేదంటే - నువ్వు పన్నిన వల చాలా గట్టిదన్న మాట!"

అతనంటున్న ఒకొక్క మాటా వరాలి శరీరంలో వాడి శూలంలా గుచ్చుకొంటోంది. మాటలేకాదు చూపులూ బాణాల్లా సర్వావయవాల్నీ పరామర్శిస్తున్నాయి

"నిన్ను చూసి ఏ అయిదారేళ్ళో అయింది...అవునా?"

వరలక్ష్మి తలెత్తి చూసింది ఒక్కసారి భూమి రెండుగా చీలిపోతే బాగుణ్ణు అనిపించింది... "నీళ్ళిస్తాను...కాళ్లు." అంది మాట మార్చుదామని

"ఒద్దు నిన్ను చూస్తేనే పంచమహాపాతకాలూ చుట్టుకుంటాయి. నేనందుకు రాలేదు. నువ్విచ్చే నీళ్లూ-నువ్ పెట్టబోయే భోజనం నాకు ఉచ్ఛిష్టంతో సమానం... సుబ్రమణ్యం ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడో నా కర్థమైంది ఏమో అనుకున్నాను కాని - వాడిది మంచి టేస్టే...!"

మామగారి మాటల్లోని అంతర్యం బోధపడక అతని కళ్ళలోకి చూసింది వరాలు భరించలేని వుద్వేగంతో సర్వాంగాలూ కంపించసాగేయి మునిపంటితో కింది అధరాన్ని బిగపట్టింది నుదుటిమీద స్వేదబిందువులు చేరసాగేయి... మామగారు కుర్చీలోంచి లేచి కోడలి దగ్గరికి నడిచేరు ..

"సరిగ్గా తిండిలేక నీరసించేవే గాని ఫస్టుగా వున్నావ్. ముఖానికి పౌడర్ స్నోలు అద్దినట్టులేదు అవయ్ పోయేయా? అయినా ఫర్వా లేదు అందంగానే వున్నావు. నీ కిప్పుడు ఇరవైనాలుగేళ్ళుంటాయా? ఇరవయ్ అయిదా? అందుకే నన్నమాట-ఆమాయకుడు-ఆ వెధవ నీ కింతలా లోబడిపోయి నీ కొంగట్టుకు తిరుగుతున్నాడు......"

అతనలా అంటూనే వరాలి నడుంచుట్టూ చేతులు పోనిచ్చేడు అమాంతం వరాల్ని మంచంమీదికి ఒక్కతోపు తోసేడు. తల మంచంకోడుకి తగిలి బొప్పి కట్టింది. సురసురమని నొప్పి పెట్టసాగింది ..కాళ్ళూ చేతులూ గిజగిజ కొట్టుకుంది అయినా అతని బలంముందు ఆమె ప్రయత్నాలు ఫలించలేదు అతని చేతులు ఒళ్ళంతా తడుముతున్నాయి. జాకెట్టు గుండీలు వూడి రొమ్ములు బయల్పడ్డాయి వాటిమీద అతని ముఖం వరాలి మనస్సు కకావికలైంది రెండు చేతుల్తోనీ అతని ముఖం నెట్టుతూ—



“మామగారూ, ఏమిటీ ఘోరం? మీరు నాకుతండ్రిలాంటివారు” అంది దీనంగా.

అతను వికటంగా నవ్వేడు “కొడుకు లాంటి మరిదితో కులికేవు ఇన్నాళ్ళూ! అప్పు దేమైంది నీ బుద్ధి?” అంటూ ముఖం వరాలి బుగ్గలమీదికి ఎత్తేడు. శుష్కించిన ఆమె చెంపలమీద అతని పెదాలు వాతలు పెట్టేయి. బలం వున్నంత వరకూ గింజుకుని—ఆఖరికి నిస్త్రాణగా వెనక్కి వాలిపోయింది వరాలు...

అయిదు నిమషాలకి—

గాజుగుడ్లలాంటి కళ్ళతో శూన్యాల్ని అన్వేషిస్తున్న వరాల్ని చూసి—“ధూ—పాపిష్టిదానా, వాడొస్తే నేనొచ్చేనని

వెళ్ళు!'' అని తలుపు తీసుకుని వీధిలోకి నడిచే డతను

పడుకునివున్న వరలక్ష్మిలో చలనం లేదు అలాగే చూస్తూ చాలా సేపు వుండిపోయింది

*　　*　　*

ఏ కారణంగానో ట్రైన్ మీదికి వెళ్ళడం తప్పిపోయిన సుబ్రహ్మణ్యం - ఇన్స్టిట్యూట్లో రాత్రి పన్నెండుదాకా పేకాడి - దార్లో కొంత 'లిక్కర్' పోసుకుని ఇంటికి బయల్దేరేడు. తలుపులు బార్లా తీసివున్నాయి మంచంమీద నలిగి నుజ్జు అయిన పట్టుచీరా - జాకెట్టూ వున్నాయి మంచంకింద ఏవో కాగితం ముక్కలు చిందరవందరగా పడివున్నాయి వంటింటి గుమ్మంలోకి వెళ్ళి చూసేడు పొయ్యిలో రగుల్తూన్న రాక్షసి బొగ్గు కణకణ మంటూ ఎర్రగావుంది. 'వరాలూ!' అని పిలిచేడు సమాధానం లేదు।

మళ్ళీ గదిలోకివొచ్చి చూసేడు టేబిలుమీద ఏదో మడతపెట్టివున్న కాగితం విప్పి గబగబ చదివేడు

"సుబ్రహ్మణ్యం,

మొగుడుచచ్చిన ఆడదానికి ఈ ప్రపంచంలో ఎంత సానుభూతి ?

పునర్వివాహానికీ - సుఖప్రదమయిన జీవితానికీ చట్టబద్ధంగా నోచుకున్నా - ప్రాక్టికల్గా అవి లభించని నేను - ఓ విధవని - అడ్డమైన ప్రతిమగాడికీ భోగవస్తువుగా వుపయోగపడ్డానికి పనికొస్తానుట ఏం ఖర్మ! ఇందుకు నిన్నుగానీ మీ మొగజాతినిగానీ నిందించబోవటం లేదు ఈ సృష్టిలోనే - ఈ చరాచర ప్రపంచంలోనే - అందులోని సాంఘిక ధర్మాల్లోనే - మనుషుల మనసుల్లోనే ఏదో లోపం ఎక్కడో వుంది ఏ శీలాన్ని నీకూ, మీ అన్నయ్యకీ మాత్రం అర్పించానో - ఏ శీలాన్ని నీ స్నేహితుల బారినుండి బతిమాలి బామాలి రక్షించుకున్నానో - అదే శీలాన్ని మీ నాన్నగారు కొల్లగొట్టేరు

దారిద్ర్యాన్ని భరించగలనుగాని - అవమానాన్ని భరించలేన్నేను

మన పొయ్యిలో కణకణ మని రగుల్తూన్న రాక్షసిబొగ్గూ - సీసాలో మిగిలిన కొద్దిపాటి కిరోసిన్ నన్ను, ఆత్మహత్య చేసుకోమన్నాయి కాని నేను చావను నేను పిరికిదాన్నికాను మగాళ్ళ స్వార్థప్రయోజనాల వలలో పడే చేపపిల్లనికాను కాబోను. నేనూ మనిషినే మీమీద ప్రతీకారాగ్ని తీర్చుకోడానికేనా నేను బతికివుండాలి వుంటానుకూడా!

నాలో రగులుకొన్న రాక్షసిబొగ్గులా ప్రతీకారాగ్ని ఎర్రగా మండుతూ - నాలుకలు చాచుతోంది మానవత్వాన్ని వమ్ముచేసే - ఏ ధర్మాన్నయినా, ఏ అన్యాయాన్నయినా - వ్యవస్థనైనా చివరంటా కాల్చి మసి చేసేదాకా నాకు విశ్రాంతిలేదు లేనేలేదు।

కృతజ్ఞతల్తో

నీ

సీతావరలక్ష్మి"

—ఉత్తరం చదివి - అయోమయంగా మంచంమీద నలిగిపడివున్న పట్టుచీరనీ, చిరిగిన జాకెట్టునీ సుబ్రహ్మణ్యం మరోసారి చూసేడు. అలా చూస్తూనే నిలబడిపోయేడు।